# మోహం

## కె. సునీతా నాయర్

ఆవిడ కళ్ళు మగతగా మూసుకొంటున్నాయి. మూసిన కళ్ళముందు ఏవేవో దృశ్యాలు. అసంపూర్తి చిత్రాల్లా — తల, మొండెం వేరు పడిన శవంలా — అర్ధరాత్రి పన్నెండు గంటలకు స్కాచ్ విస్కీ, ఆ తర్వాత సేవించిన జర్దా కిళ్ళీ కలసిన ఒక విధమైన వెగటు కలిగించే వాసన. ఉదయం నుండీ, అర్ధరాత్రివరకు ఎదురు చూసీ, చూసీ అలసిన కళ్ళు ఒక్కసారిగా నిస్పృహతో క్రిందికి వాలిపోయాయి." ఇంకా నిద్రపోలేదా! ఓహో... నిద్రమందు నే నివ్వాలనా! రా... ఏంటీ ఆ విదిలింపు? ఒంటి మీద పడే గాట్లవల్ల నేను నచ్చడం మానేశానా ఈ మధ్య! లేక పండగనాడూ పాత మొగుడేనా అన్నట్లు రోజూ చూసే ముఖమేగా అనా? అయినా తప్పదు ఊ... కదలకు...."

భరించలేని బాధను పళ్ళ బిగువున సహిస్తున్నట్లు కళ్ళు చికిలించి, ముఖంలోని కండరాలన్నీ బిగుసుకోగా

అగ్నిసాక్షిగా అందరి ముందు వేద మంత్రాల్తో (అన్ని ప్రమాణాలతో) కట్టించుకొన్న తాళి ఇవ్వలేని మనశ్శాంతిని, భరోసాని, జీవితం మీద ఆశను ఇవ్వగలిగిన ఆ కళ్ళు ఆమెను మైకంలోకి లాక్కెడుతూ — భరించలేని ఈ ఆనందాన్ని శాశ్వతం, చేసుకోవాలని తపనగా, అతని తలను గుండెల కదుముకొని, అతని మీద తనకి కలిగిన ఇష్టానికి, ప్రేమకు పరాకాష్ఠగా అతనిలో ఐక్యం కావాలన్న తహతహతో అతన్ని తీగలా పెనవేసుకొన్న తన శరీరం,

వేడి తగిలిన వెన్నలా కాక, చిరుగాలి తాకిడికి వణికిన తీగలా, అణువణువు పరవశిస్తుంటే — ఈ క్షణం శాశ్వతమై — జీవితం ఇక్కడే అంతమై బాధ్యతలు ఇక్కడే ముగిసిపోతే....అంతే! ఆమె కళ్ళు మళ్ళీ మూతలు పడ్డాయి.

> **అంతిమ క్షణాల్లోని హృదయఘోష, రెండువేల మైళ్ళ దూరాన ఉన్న అతనికి, నిశ్శబ్ద తరంగాల్లా మారి అతని హృదయాన్ని అదృశ్యంగా తాకుతున్నాయని ఆమెకు తెలిస్తే... తెలుసేమో! అందుకే ఆ ప్రాణం ఉంది.**

మెల్లగా కళ్ళు విప్పి, చీకట్లో దారి వెతుకుతున్న బాటసారిలా శూన్యం లోకి చూసిందామె. తదేకంగా, ప్రశాంతంగా పేలింగు చూస్తున్న కళ్ళు, ఏదో అతి దీక్షగా వీక్షిస్తున్నట్లు... చల్లని వెన్నెల వేళ ప్రశాంత వాతావరణంలో మెల్లని కొబ్బరి ఆకుల కదలిక, ఎదురుగా తెల్లని దుస్తులతో, పన్నీటి జల్లు లాటి చూపులతో 'అతను'!

మూసిన కనురెప్పల మీద అతి సున్నితంగా చుంబిస్తూ, ఆర్తితో ఎదలో పొదవి పట్టుకొన్న ఆ చేతుల స్పర్శ —

నే నుండగా లోకంలో ఏ శక్తి నిన్ను బాధించదన్న ఓదార్పు నిచ్చే ఆ చేతుల స్పర్శ — నీ కోసం నేనున్నానన్న ఆ చూపులోని ఓదార్పు — తనదైన వస్తువుని విధిలేని పరిస్థితుల్లో పరాధీనం చేయాల్సి వచ్చినపుడు, ఆఖరు సారి ఆ వస్తువుని చూస్తూ నిట్టూర్పు విడుస్తున్నట్లున్న ఆ చూపు,

అతి మధురమైన కల కంటున్న వ్యక్తిని గోళ్ళతో రక్కసంగా రక్కి మరీ నిద్ర లేపినట్లు... అంతటి మగతలోనూ ఉలిక్కి పడిందామె.

ఆమెకు తెలుసు ఇవే తన ఆఖరు క్షణాలని — ఇరవై అయిదు సంవత్సరాల నిరంతరమైన మనోవ్యధకు, క్షోభకు, అర్థం లేకుండా గడిపిన జీవితానికి, పిల్లల పేరుతో ఆత్మవంచన చేసుకొంటూ గడిపిన బంగారు గోడలతో కట్టిన జైలు జీవితానికి ఇదే ముగింపని ఆమెకు ఒక వైపు ఆనందంగా ఉంది.

అర్ధరహితమైన, ఎడారి లాటి జీవితానికి ఇంత త్వరగా ముగింపు దగ్గర పడినందుకు ఒకవైపు దుఃఖం...

అశాంతి — నిస్సారమైన తన నిర్భాగ్యపు జీవితంలోకి పరిమళపు జల్లులా, స్వాతి వానలా, ఎండమావిలో ఒయాసిస్సులా, ఎండలో వెన్నెల్లా, వేసవిలో మల్లెల్లా విచ్చేసి, బ్రతుకులోని తీయదనాన్ని చవి చూపించిన 'అతన్ని' కడసారి ఒక్క చూపైనా చూడలేకపోతున్నందుకు.

డాక్టరు ఎప్పుడో పెదవి విరిచేశాడు. "ఐయాం సారీ — ఆవిడ ఎవరి కోసమో ఎదురు చూస్తున్నారు. ఇంకా ఎవరైనా రావల్సి ఉంటే త్వరగా రప్పిస్తే మంచిది". అంటూ...

ఆ 'ఎవరో' తెలిసిన వ్యక్తి అక్కడ ఒక్కరే — ఆవిడ భర్త కాని 'అతను' ఎక్కడుంటాడో ఆయనకు తెలీదు. తెలిసినా పిలిపించేంత విశాల హృదయం లేదు. అందుకే ముఖం మాడ్చుకొని అవతలి కెళ్ళిపోయాడు.

ఆవిడ ఇవేవీ గమనించే స్థితిలో లేదు. ఎవరినీ గుర్తించే స్థితిలో కూడా లేదు. ఆవిడ ఎదురు చూస్తున్న వ్యక్తి వస్తాడో, రాడో కూడా ఆమెకు తెలీదు.

కాని ఆవిడ మనసు మూగగా అతనిరాకకై ఆక్రోశిస్తోంది.

హృదయం బ్రద్దలయ్యేంత బలంగా నా మనసు నిన్నే పిలుస్తోంటే, నువ్వేమో నాకు దూరంగా — అతి దూరంగా పారిపోవాలని చూస్తున్నావా నేస్తం? నాకు తెలుసు నా పిలుపుకి బదులివ్వలేవని — అయినా — నా మనసు నిన్నే పిలుస్తోంది. ఈ రోజు కాకుంటే రేపు, ప్రాణాలతో కాకుంటే శవాన్నయి, ఈ జన్మలో కాకుంటే మరోజన్మలో, జీవితంలోకాకుంటే ఊహల్లో — నీ ఊపిరిలో కలుస్తాననే నమ్మకం నాకుంది.

ఆవిడ ఆరాధనా బలంతో కూడుకొన్న ఆత్మ సంకల్ప శక్తి, అంతిమ క్షణాల్లోని హృదయ ఘోష, రెండు వేల మైళ్ళ దూరాన ఉన్న అతనికి, నిశ్శబ్ద తరంగాల్లా మారి అతని హృదయాన్ని అదృశ్యంగా తాకుతున్నాయని ఆమెకు తెలిస్తే.... బహుశా తెలుసేమో! అందుకే ఆ ప్రాణం మొండిగా ఆమె నంటిపెట్టుకొని ఉంది.

* * * *

"మనం వెళ్ళిపోదాం — ఈ నరకంలో నువ్వుంటానన్నా నేనుండనివ్వను. నువ్వు లేకుండా — నీ అమృతమయమైన హస్తాల చలవ లేకుండా నేను బ్రతకలేను. నన్ను శిక్షించకు — అన్యాయం, పాపం, తప్పు అనకు — ఏది తప్పు? ఏది ఒప్పు, ఏది న్యాయం! ఏది పుణ్యం? ఎక్కడున్నాయ్ వీటి విలువలు, కొలబద్దలుగా మారేమనుషుల మనసుల్లో తప్ప — నాకు నువ్వు కావాలి — నీకు నేను కావాలి మూడు ముళ్ళంటావా? మనసుతో మనసు వెయ్యలేని ఆ ముడి నరకానికి త్రోవ చూపే ఉరిత్రాడు — ఆధ్యాత్మిక బంధానికి మాత్రమే గుర్తు ఆత్మబంధానికి కాదు."....

ఏదో ట్రాన్స్‌లో ఉన్న ఋషిలా కళ్ళు మూసుకొని కూర్చొని ఉన్న అతన్ని "ఎక్స్క్యూజ్ మి సర్" అన్న ఎయిర్ హోస్టెస్ పిలుపుతో ఫులిక్కిపడి కళ్ళు తెరచి, ఆవిడ ఆఫర్ చేస్తున్న చాక్లెట్ ట్రే చూసి — అందులోని కాటన్ పాకెట్ మాత్రం తీసుకొంటూ "థాంక్స్" అంటూ అందులోని దూదిని రెండు చెవుల్లోనూ ఉంచుకొని తిరిగి కళ్ళు మూసుకొన్నాడు ధ్యానంలోకి వెళ్ళే మౌని లా.




* * * *

ఆరోజు వేయి ఆశలతో, కోటి కోర్కెలతో భవిష్యత్తును బంగారు బాటలా ఊహించుకొంటూ ఆగమేఘాల మీద ఆమెను చేరి — తమ పెళ్ళికి తనవాళ్ళు ఒప్పుకొన్నారన్న సంతోష వార్త వినిపించి — ఆవిడ చెక్కిటి గుండెల్లో సిగ్గుతో పూచే మందార పువ్వుల్ని, ఏరుకొందామని పరుగున వచ్చిన తనకు పిడుగుపాటు లాటి వార్త — ఆమె ఇక పరాయి సొత్తని — ఆ నాటితో జీవిత మంటేనే విరక్తి కలిగి — వైరాగ్యంతో, తాత్త్విక చింతనలతో కాలం గడుపుతున్న తనకు — మళ్ళీ తారస పడి — తన వర్తమాన జీవితాన్ని వివరిస్తూ — గట్టు తెగిన వాగులా ప్రవహించిన ఆవిడ అంతరంగ ఘోషను విని తట్టుకోలేక — దగ్గరయిన తనను మళ్ళీ సంఘం — కట్టుబాట్ల పేరుతో దూరంగా నెట్టివేసింది.

తను ఆమెను మనసారా ప్రేమించాడు — ప్రేమంటే నూటికి తొంభై శాతం మంది అనుకొనేలా కామం కాదు. త్యాగం —

అందుకే ... అందుకే ఈ నాటికీ ఒంటరిగానే మిగిలి పొయ్యాడు. కాని ఈ రోజు ఆవిడ్ని చూడాలన్న కోరిక తీవ్రతరమౌతోంది. ఇంకెంత! ఇంకో గంట. తనామెను చూస్తాడు. చూసి తీరతాడు. లోకంలో ఏ శక్తి అడ్డ మొచ్చినా సరే ఆవిడ్ని చూడకుండా మాత్రం వెనక్కు రాడు. ఇంకొన్ని క్షణాల్లో విమానం హైదరాబాద్‌లో లాండ్ కాబోతుంద న్న ఎనౌన్స్‌మెంట్ విని పాకెట్‌లో భద్రపరిచిన ఓ వస్తువుని ఆప్యాయంగా తాకి — తృప్తిగా చూసుకొని మళ్ళీ జాగ్రత్తగా దాన్ని పాకెట్‌లో దాచేశాడు.

* * * *

ఆవిడ నోట్లో కాస్త తులసి తీర్థం పొయ్యండి. అన్నారెవరో.

అన్నదెవరో అని తిరిగి చూసిన ఆవిడ భర్త స్థాణువయ్యాడు. ఆ అన్న వ్యక్తి ప్రక్కనే మరో వ్యక్తి — మాసిన గడ్డంతో — వదులుగా ఉన్న పైజామా — లాల్చీతో — నిర్లిప్తత నిండిన చూపులతో — అడుగులో అడుగు వేసుకొంటూ చేత్తో ఓ వస్తువుతో ఆవిడ్ని సమీపిస్తున్న అతన్ని చూసి దూరంగా జరిగారాయన.

"మాధవీ... ఇది నీ కోసం... ఇన్నేళ్ళకు నే కొని తెచ్చిన కానుక...." ఆవిడ నొసట కుంకుమ దిద్దుతూ — ఆర్ద్రత నిండిన చూపులతో కుంకుమ భరిణె ఆవిడ చేతుల్లో ఉంచుతున్న అతనిచూపులతో కలసిన ఆవిడ చూపులు తృప్తిగా కిందికి వాలుతుండగా అతనిలోని జీవం — ఆవిడ ప్రాణంతో చెట్టా పట్టా లేసుకొని ఆకాశం వేపు పరుగు తీసింది.

(ప్రేమకు సజీవ రూపంగా నిలచిన ఒక ప్రేమారాధకుడ్ని ప్రత్యక్షంగా చూశాక — చలం గారి నవల లిచ్చిన స్ఫూర్తితో — 'సునీత')

*